సాక్షి ఒడిశా

సోమవారం । 12 । ఆగస్టు । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు: రూ. 6,56,775
బంగారం: 1 గ్రాము 250 మిల్లీ గ్రాములు
వెండి: 91 గ్రాముల 700 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



రైల్వే ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్

రాష్ట్రం పరిధిలో 8 కొత్త రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ అనుమతివ్వడంతో ఎంపీలు హర్షం వ్యక్తం చేశారు.

- 8లో



రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛభారత్

స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని బీజేపీ నాయకులు, కార్యకర్తలు పర్లాకిమిడి రైల్వే స్టేషన్‌లో ఆదివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు.

- 8లో

న్యూస్‌రీల్

కలెక్టర్‌కు వీడ్కోలు



కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్‌ను అభినందిస్తున్న ఎస్పీ స్వాతి ఎస్.కుమార్

పర్లాకిమిడి: గజపతి జిల్లాత కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ కేంద్రపడా జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయిన నేపథ్యంలో ఆదివారం స్థానిక యూనియన్ బ్యాంక్ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రం మందిరంలో వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు, బీడీఓలు, తహశీల్దార్లు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ స్మృతి రంజన్ ప్రధాన్ సేవలను కొనియాడారు. 14 నెలల పాటు జిల్లా పాలనాధికారిగా విశేష సేవలందించారని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ కార్యనిర్వాహణ అధికారి డా.గుణనిధి నాయక్, డిప్యూటీ కలెక్టర్లు ప్రాణకృష్ణ పాణిగ్రాహి, కమలకాంత పండా, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, ఛెలిగడ ప్రాజెక్టు భూఅధిగ్రహణ అధికారి రబీంద్ర కుహోరో, సబ్ కలెక్టర్ అలోక్ కుమార్ పండా, ఐటీడీఏ పీఓ దిలీప్‌కుమార్ బెహరా, డీఎస్పీ సునీల్ కుమార్ మహంతి, వయోవృద్ధులు ఉత్కళ హితేషిణీ కార్యదర్శి పూర్ణచంద్ర మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

ఎదురుకాల్పుల్లో పశువుల స్మగ్లర్‌కు గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్మగ్లర్

భువనేశ్వర్: కెంజొహర్ జిల్లాలో పశువుల అక్రమ రవాణాదారులు, పోలీసులు మధ్య ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో పశువుల్ని అక్రమంగా తరలిస్తున్న ముఠాకు చెందిన వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కెంజొహర్ జిల్లా హరిచందన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కులభకుని గ్రామం వద్ద ఈ ఘటన జరిగింది. అటవీ రహదారిపై ఐదు పశువుల ట్రక్కులను పోలీసులు ఆపడంతో ఘర్షణకు దారితీసింది. ఈ కాల్పుల్లో ఆరిఫ్‌ఖాన్ అనే స్మగ్లర్ తీవ్రంగా గాయపడటంతో కెంజొహర్ జిల్లా ప్రధాన ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. పశువులను లోడ్ చేసిన మూడు పికప్ వ్యాన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరో రెండు వాహనాలతో నిందితులు పశ్చిమబెంగాల్ వైపు పరారైనట్లు సమాచారం.

దాడులు ఆపండి: మమతా

భువనేశ్వర్: ఒడిశాలో నివాసముంటున్న పశ్చిమబెంగాల్ వాసులపై జరుగుతున్న దాడులు తక్షణమే ఆపాలని ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ ఒడిశా ముఖ్యమంత్రిని కోరారు. బంగాళదుంపల సమస్యపై ఒడిశా సీఎం ఫోన్ చేయగా మమత పైవిధంగా స్పందించారు. బంగ్లాదేశ్ చొరబాటుదారుల పేరిట జగత్‌సింగ్‌పూర్‌లో పశ్చిమబెంగాల్ వాసులపై దాడులు చేయడం సరికాదన్నారు.



భారత పతాకంతో హాకీ జట్టు అధికారిక బృందం



అదరహో అనిపించేలా ప్రదర్శన చేసిన భారత హాకీ జట్టు

ఉత్కళ సంకల్పానికి సలాం

ఒడిశా గెలిచింది. విశ్వవేదికపై మురిసింది. దేశంలోని ఏ ఇతర రాష్ట్రాలూ కన్నెత్తి కూడా చూడని హాకీ క్రీడను అక్కున చేర్చుకుంది. క్రీడాకారుల వెన్నంటే నిలిచింది. ప్రపంచస్థాయి స్టేడియాన్ని నిర్మించింది. క్రీడా సాధనకు అవసరమైన సకల సదుపాయాలను సమకూర్చింది.
హాకీ అంటే ఒడిశా.. ఒడిశా అంటే హాకీ అన్నంతగా ప్రోత్సహించింది. దశాబ్దాలుగా అందిస్తున్న ఈ ప్రోత్సాహాన్ని భారత జట్టు సైతం గుర్తుంచుకుంది. తన అద్భుత ప్రదర్శనతో పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించింది. విశ్వవేదికపై భారత మువ్వన్నెల జెండా రెపరెపలాడిస్తూ ఒడిశాకు చిరస్మరణీయ బహుమతిని అందించింది.

- ఒలింపిక్స్‌లో హాకీ జట్టుకు కాంస్య పతకం వెనుక ఒడిశా సర్కారు కృషి
- దశాబ్దాలుగా నవీన్ పట్నాయక్ ప్రోత్సాహం
- అందుబాటులోకి ప్రపంచస్థాయి స్టేడియం
- హాకీ జట్టుకు నజరానాలు ప్రకటించిన సీఎం మాఝీ

స్పాన్సర్‌షిప్ పొడిగింపు

2018 నుంచి భారత హాకీ జట్టుకు స్పాన్సర్ చేస్తున్న ఒడిశా ప్రభుత్వం హాకీ ఇండియాతో స్పాన్సర్‌షిప్ ఒప్పందాన్ని 2036 వరకు పొడిగించింది. గత ఏడాది మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పునరుద్ధరించిన స్పాన్సర్‌షిప్ ఒప్పందాన్ని 2033 వరకు అమలు చేయాల్సి ఉండగా కొత్త ప్రభుత్వం దానిని మరో మూడేళ్లపాటు పొడిగించింది. కాగా, 2018 (భువనేశ్వర్), 2023 (భువనేశ్వర్, రూర్కెలా)లో వరుసగా రెండు పురుషుల ప్రపంచ కప్‌లకు ఆతిథ్యమిచ్చిన ఒడిశా దశాబ్దంలో భారత హాకీకి నిలయంగా మారింది.



కల సాకారమైందంటూ సోషల్‌మీడియాలో మీమ్స్ వెల్లువ



ఒలింపిక్ క్రీడల్లో కాంస్య పతకం సాధించిన భారత్ హాకీ జట్టు

భువనేశ్వర్: పారిస్ ఒలింపిక్స్‌లో భారత హాకీ జట్టు కాంస్య పతకం గెలవడంతో సంబరాలు మిన్నంటుతున్నాయి. దీనివెనుక ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కృషి మరువలేనిది. దశాబ్దాలుగా దేశంలో హాకీ క్రీడ దాదాపు మరుగున పడి విపత్కర పరిస్థితుల్లో ఉన్న వేళ అంతర్జాతీయ స్థాయిలో భారత్ జట్టు రాణించేందుకు నవీన్ శంఖారావం పూరించారు. హాకీ క్రీడా రంగానికి రాష్ట్రం ప్రముఖ కేంద్రంగా వెలుగొందాలని పిలుపునిచ్చారు. దేశంలో ఏ ఇతర రాష్ట్రం, కేంద్ర పాలిత రాష్ట్రాలు ముందుకు రాని గడ్డు పరిస్థితుల్లో ఒడిశాలో అప్పటి బీజేడీ సర్కారు క్రీడాస్ఫూర్తితో ముందడుగు వేసింది. ఆ ఫలితమే నేడు తాజా ఒలింపిక్ క్రీడల పోటీల్లో భారత పురుషుల హాకీ జట్టుకు కాంస్యం అందించిందని సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఉనికిని బలపరచుకుంటూ..

ఉన్నత శ్రేణి పోటీల్లో పాలుపంచుకునేందుకు కనీస స్తోమత లేని దయనీయ పరిస్థితుల నుంచి భారత హాకీ జట్టు అంతర్జాతీయ ఒలింపిక్ క్రీడల్లో సాధించే స్థాయికి ఎదగడం వెనుక ఎంతో కృషి ఉంది. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో భారత జట్టు అర్హత సాధించలేకపోయింది. 2011 సంవత్సరం నాటికి ధీటైన పోటీల్లో పాలుపంచుకునేందుకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడేది. 2012 నుంచి భారత హాకీ జట్టు క్రమంగా ఉనికిని చాటుకోవడం ఆరంభించింది. 2012, 2016 ఒలింపిక్స్ క్రీడల్లో భారతదేశం వరుసగా 12, 8వ స్థానంలో చోటు దక్కించుకుంది.

దశ తిరిగింది..

హాకీ జట్టుకు ప్రపంచ దేశాల సరసన నిలబెట్టే దృఢ సంకల్పంతో ఒడిశా ప్రభుత్వం 2018 నుంచి భారతీయ హాకీకి స్పాన్సర్ ప్రకటించి దన్నుగా నిలిచింది. వెన్నుతట్టి ముందుకు నడిపించడంతో భారత్ జట్టు తిరుగలేని విజయాల్ని కైవసం చేసుకుంది. 2020, 2024లో భారత్ జట్టు రెండు బ్యాక్ టు బ్యాక్ ఒలింపిక్ పతకాలను గెలుచుకుంది. అంతకు ముందు చివరి సారిగా భారతీయ హాకీ జట్టు 1980లో పతకం సాధించడం గమనార్హం. దాదాపు నాలుగున్నర దశాబ్దాల దీర్ఘ కాల నిరీక్షణ తర్వాత పతకాల విజేత జాబితాలో స్థానం పదిలపరచుకుంది. 2018లో సహారా హాకీని స్పాన్సర్ చేయడం నుంచి వైదొలగడంతో హాకీ జట్టు ఇబ్బందుల్లో చిక్కుకుంది. ఈ విపత్కర పరిస్థితుల్లో ఒడిషా రంగంలోకి దిగి భారత హాకీకి తన పూర్తి మద్దతు ప్రకటించింది. అది మొదలుకొని జట్టు వెనుదిరగకుండా మునుముందుకు దూసుకుపోతోంది.

ప్రత్యేక ఆహ్వానం..

పారిస్ ఒలింపిక్స్‌లో స్పెయిన్‌పై అద్భుత విజయం సాధించి కాంస్య పతకాన్ని గెలుచుకున్న భారత పురుషుల హాకీ జట్టును ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ప్రత్యేకంగా ఆహ్వానించారు. హాకీ ఆటగాళ్లకు ఒడిశా హృదయంలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. భారత్ జట్టులో ఒక్కో క్రీడాకారుడికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.15 లక్షలు, సహాయక సిబ్బందికి రూ.10 లక్షలు చొప్పున నజరానా ప్రకటించారు. ఒడియా ఆటగాడు అమిత్ రోహిదాస్‌కు నాలుగు కోట్ల రూపాయల ప్రత్యేక అవార్డును కూడా ప్రకటించారు.

నవీన్ ఆనందం..

ఎన్నో దశాబ్దాల తర్వాత ఒలింపిక్స్‌లో వరుసగా కాంస్య పతకాలను భారత హాకీ జట్టు గెలుచుకోవడం పట్ల నవీన్ పట్నాయక్ ఆనందం వ్యక్తం చేశారు. పారిస్ ఒలింపిక్స్‌లో విజయం ప్రతి భారతీయుని హృదయాన్ని గర్వంతో నింపిందని పేర్కొన్నారు. తనకు వ్యక్తిగతంగా కూడా భావోద్వేగమైన అంశమని, దేశం మరిన్ని పతకాలను సాధించాలని ఆకాంక్షించారు.

అగ్రస్థానంలో రాష్ట్రం..

హాకీ క్రీడా రంగంలో ఒడిశా అగ్ర స్థానంలో కొనసాగుతోంది. రాష్ట్రానికి చెందిన ఒలింపిక్ హాకీ స్టార్ దిలీప్ తిర్కీ ప్రతిష్టాత్మక పద్మశ్రీ, అర్జున అవార్డుల సత్కారంతో హాకీ ఇండియా అధ్యక్షుడుగా కొనసాగుతున్నారు. రౌర్కెలా హాకీ పుట్టినిల్లుగా భాసిల్లుతుంది. ఈ ప్రాంతం నుంచి చాలామంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయి వరకు ఎదుగుతున్నారు.




ఫోన్‌లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝీ

- బంగాళాదుంపలు ఒడిశాకు రాకుండా అడ్డుకుంటున్న పశ్చిమబెంగాల్
- పరిస్థితి తీవ్రతను పెంచిన పౌర సరఫరాల శాఖ మంత్రి వ్యాఖ్యలు
- ఉత్తరప్రదేశ్ నుంచి దిగుమతి చేసుకుంటామంటూ ప్రగల్భాలు
- నాణ్యత లేదంటూ విముఖత చూపిన వ్యాపారులు
- రంగంలోకి దిగిన సీఎం మోహన్‌చరణ్ మాఝీ
- పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీతో మరోసారి సంప్రదింపులు

అటు బెంగాలు.. ఇటు బంగాళ!

ఒడిశా వాసులకు బంగాళాదుంపల బెంగ తీరడం లేదు. కొలిక్కి వచ్చిందనుకున్న కొరత సమస్య.. మంత్రి వ్యాఖ్యలతో మరింత ముదిరింది. దీంతో ఎట్టి పరిస్థితుల్లోనూ పశ్చిమబెంగాల్ నుంచి ఒడిశాకు బంగాళాదుంపలు రవాణా కాకూడదంటూ మమతా బెనర్జీ సర్కారు పట్టుబిగించడంతో స్థానిక సీఎం మోహన్‌చరణ్ మాఝీ రంగంలోకి దిగారు. బంగాళాదుంపలు తమ రాష్ట్రానికి సరఫరా చేయాలంటూ తాజాగా ఫోన్‌లో సంప్రదింపులు జరిపారు.

బంగాళదుంపల కొరతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఒడిశా



భువనేశ్వర్: రాష్ట్రంలో ఆలుగడ్డల కొరత గట్టెక్కడం లేదు. పొరుగున ఉన్న పశ్చిమ బెంగాల్ ఎగుమతి చేసే బంగాళదుంపలతో రాష్ట్ర ప్రజల అవసరాలు నిరాటంకంగా గట్టెక్కుతుండేవి. అయితే కొన్నాళ్లుగా ఇరుగు పొరుగు రాష్ట్రాల మధ్య సఖ్యత చెడటంతో పరిస్థితులు మారిపోయాయి. బంగాళదుంపల రవాణా ఆగిపోయింది. ఫలితంగా అమాయక ప్రజలు ఇబ్బందుల పాలయ్యారు. ఈ క్రమంలో ఉత్తరప్రదేశ్ నుంచి ఆలుగడ్డలు రప్పించుకుని పశ్చిమ బెంగాల్ ఆగడాలకు క్లెం వేస్తామని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి కృష్ణచంద్ర పాత్రో బాహాటంగా ప్రకటించడంతో పరిస్థితి తీవ్రమైంది.

సీసీ కెమెరాల నిఘా..

మంత్రి వ్యాఖ్యలతో పశ్చిమబెంగాల్ ప్రభుత్వం తన ప్రతాపం చూపిస్తోంది. ఆలుగడ్డలు వెళ్లకుండా కట్టడి చేసింది. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సైతం ఆలుగడ్డలు తరలించే ట్రక్కుల కదలికలపైనా నిఘా పెట్టింది. వీటిని తనిఖీ చేసేందుకు ఒడిశా సరిహద్దులో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని బెంగాల్ ప్రభుత్వం నిర్ణయించింది. పశ్చిమ బెంగాల్ పోలీసులు సరిహద్దులోని నీలదా గ్రామం వద్ద సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి లక్ష్మణ్ నాథ్ టోల్ గేట్ వద్ద ఒడిశాలోకి ట్రక్కులు ప్రవేశించకుండా అడ్డుకుంటున్నారు. 24 గంటల పోలీసు పహారాతో 10 మార్గాల్లో 6 చోట్ల సీసీటీవీలను ఏర్పాటు చేసినట్లు తెలియడంతో ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం ఉలికిపాటుకు గురైంది.

తొలి సంప్రదింపులు..

రాష్ట్రంలో ఆలుగడ్డల కొరత తలెత్తడంతో మొదట్లోనే విపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీకి లేఖ రాశారు. ఆలుగడ్డల రవాణాకు అడ్డంకులు తొలగించాలని అభ్యర్థించారు. ఆ తర్వాత నీతి ఆయోగ్ సమావేశం పురస్కరించుకుని ఢిల్లీలో భేటీ అయిన సందర్భంగా సీఎం మమత బెనర్జీని అభ్యర్థించారు. దీంతో కొద్ది రోజులపాటు ఆలుగడ్డల రవాణా నిరాటంకంగా కొనసాగింది. ఇంతలో మంత్రి వ్యాఖ్యలు ప్రసారం కావడంతో సంక్షోభం యథా స్థితికి చేరుకుంది. ఈనేపథ్యంలో కొత్త సీఎం మాఝీ మళ్లీ మమతా బెనర్జీకి ఫోన్ చేసి విన్నవించారు.

రంగంలోకి దిగిన సీఎం..

పరిస్థితి రోజురోజుకూ చేయి దాటిపోవడంతో సీఎం మోహన్ చరణ్ మాఝీ రంగంలోకి దిగారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ఫోన్ ద్వారా ఆదివారం అభ్యర్థించారు. రాష్ట్రంలో ఆలుగడ్డల కొరత నివారణకు చేయూతనివ్వాలని విన్నవించారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించినట్లు ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉత్తరప్రదేశ్ సరుకుపై విముఖత..

పొరుగున ఉన్న పశ్చిమ బెంగాల్ ఆలుగడ్డల రవాణాను నిలిపివేసిన తరువాత ఒడిశా తీవ్రమైన బంగాళా దుంపల సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ప్రత్యామ్నాయంగా ఉత్తరప్రదేశ్ నుంచి కొనుగోలు చేసి పంపిణీ చేస్తున్న సరుకు పట్ల సర్వత్రా విముఖత వ్యక్తం అవుతుంది. వినియోగదారులు మొగ్గు చూపనందున కొనుగోలు చేసేందుకు వ్యాపారులు సైతం నిరాకరించారు. 2021-22 గణాంకాల ప్రకారం జాతీయ స్థాయిలో బంగాళాదుంపల ఉత్పత్తిలో పశ్చిమ బెంగాల్ రెండో స్థానంలో ఉంది. దాని ఉత్పాదన వాటా 23.51 శాతం. ఉత్తరప్రదేశ్ 29.65 శాతంతో అగ్రస్థానంలో ఉంది.

నాల్కోను సందర్శించిన కేంద్ర గనుల శాఖ మంత్రి



నాల్కో వద్ద మంత్రి సతీష్ చంద్ర, బీజేపి నాయకులు

కొరాపుట్: కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి సతీష్‌చంద్ర దుబే కొరాపుట్ జిల్లా దమంజోడిలో భారత అల్యూమినియ కేంద్రం (నాల్కో) పరిశీలించారు. సంస్థ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు సేరుబందు గనుల తవ్వకాల వద్ద నిరసనలు రావడంతో మార్గమధ్యలోనే మంత్రి వెనుదిరిగిన సంగతి తెలిసిందే. కార్యక్రమంలో కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చో, కొట్‌పాడ్ ఎమ్మెల్యే రుపుధర్ బోత్ర, పార్టీ జిల్లా అధ్యక్షుడు సుమంత్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

హిరాకుద్ నిర్వాసితులకు స్థలం

భువనేశ్వర్: సంబలపూర్ జిల్లాలో మహానదిపై హిరాకుద్ డ్యామ్ నిర్మాణంలో నిర్వాసితులైన వారికి ప్రభుత్వం 10 డెసిమల్ విస్తీర్ణపు భూమిని అందించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ మంత్రి సురేష్ కుమార్ పూజారి ఆదివారం ప్రకటించారు. డిసెంబరు 31లోగా ప్రతి నిర్వాసిత కుటుంబానికి కొలుభూమి ఇస్తామని తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా భూమిని కోల్పోయిన కుటుంబాలు ఏడు దశాబ్దాలుగా పునరావాసం కోసం పోరాడుతున్నారు. ఇప్పటి వరకు 4,400 బాధిత కుటుంబాలకు మాత్రమే రుణ సౌకర్యం కల్పించారు.

క్లుప్తంగా

సిక్కోలు జానపదంపై పాట షూటింగ్



వడ్డినవలస సమీపంలో షూటింగ్ చేస్తున్న నిర్వాహకులు

సారవకోట: మండలంలోని వడ్డినవలస పరిసర ప్రాంతంలో సినీ ప్రొడ్యూసర్ ఇప్పిలి రామ్మోహనరావు ఆధ్వర్యంలో సిక్కోలు జానపద పాటలపై షూటింగ్ నిర్వహించారు. పీఆర్ మ్యూజికల్ (పొట్టిమామ) టీమ్ సభ్యులు శ్రీకాకుళం జానపద పాటలు, సంస్కృతి, సంప్రదాయాలను ప్రస్తావిస్తూ ఒక పాటను చిత్రీకరించారు. ఇందులో గొర్లె నూకయ్య, డింపుల్ అమ్ము తదితరులు పాల్గొన్నారు.

కాష్యూ, రైస్‌మిల్ లేబర్ యూనియన్ ఎన్నిక ఏకగ్రీవం



అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు కృష్ణమూర్తి, ఈశ్వరరావు, రాము

కాశీబుగ్గ: పలాస, కాశీబుగ్గ, మొగలిపాడు, ఇండస్ట్రియల్ ఎస్టేట్ పరిధిలో ఉన్న జీడి పరిశ్రమలు, రైల్ మిల్లర్స్ కార్మికులతో కూడిన కాష్యూ రైస్ మిల్లర్ లేబర్ యూనియన్ ఎన్నిక ఆదివారం ఉదయం 10 గంటలకు జరిగింది. పలాస కార్మిక భవనం వద్ద జరిగిన ఈ ఏకగ్రీవ ఎన్నికల్లో నూతన అధ్యక్షులుగా అంబటి కృష్ణమూర్తి, కార్యదర్శిగా సానా ఈశ్వరరావు, కోశాధికారి కోనారి రాములను ఎన్నుకున్నారు.

బ్యాటరీ చోరీ

ఎచ్చెర్ల క్యాంపస్: ఇబ్రహీంబాద్ పంచాయతీ పూడివలస రోడ్డులో ఉన్న మందు గుండు సామగ్రి గోదాం వద్ద ఉన్న జనరేటర్ బ్యాటరీ శనివారం రాత్రి చోరీకి గురైంది. రూ.20 వేల విలువ ఉన్న బ్యాటరీని గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. యజమాని శ్యాంకుమార్ ఆదివారం ఎచ్చెర్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

'ఛాయారాజ్ ఓ దార్శనిక కవి'



పంది మోహనరావును అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ఛాయారాజ్ ఒక దర్శనిక కవి, రచయిత అని ఆమదాలవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు పండితులు, ఉపనిషన్మందిర ప్రతినిధి పంది మోహనరావు అన్నారు. శ్రీకాకుళంలోని ఉపనిషన్మందిరంలో ఆదివారం విద్యారంగం–విలువలు– ఛాయారాజ్ కథలు అనే అంశంపై తెలుగు పండితులు పంది మోహనరావు ఆదివారం ఉపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నా ఆగ్రహం, నా ఆవేశం, శత్రువుకు అర్థం కావాలి, నా ప్రేమ, నా శక్తి నా భాషలో వ్యక్తం కావాలి' అని కలం ఎక్కుపెట్టిన ప్రజాకవి ఛాయారాజ్ అని అన్నారు. వివిధ సాహిత్య ప్రక్రియలో అనుభవం గల ఛాయారాజ్ కలం నుంచి వెలువడిన 'అనుపమాన' కథా రూపకాల్లో నేటి విద్యారంగం తీరుతెన్నులు వివరించారని తెలిపారు. కార్యక్రమంలో ఉపనిషన్మందిర ప్రతినిధులు పతంజలి శాస్త్రి, ఎం.మోహనరావు, ఎస్.నరసింహమూర్తి, ఎం.సంగమేశ్వరరావు, డి.జి.పట్నాయక్, రవి, కోటేశ్వరరావు, అరుణకుమారి, లక్ష్మి తదితరులు ఉన్నారు.

సైనిక లాంఛనాలతో ఎస్‌ఐ అంత్యక్రియలు



నర్సింగరావు పార్థివ దేహం వద్ద నివాళులు అర్పిస్తున్న పోలీసు అధికారులు, పారామిలటరీ అసోసియేషన్ సభ్యులు (ఇన్‌సెట్లో) యాళ్ల నర్సింగరావు(ఫైల్)

నరసన్నపేట: యుక్త వయసు నుంచి సీఆర్‌పీఎఫ్ 60 బెటాలియన్‌లో వివిధ హోదాల్లో పనిచేసి గుండె పోటుతో మరణించిన యాళ్ల నర్సింగరావు(58)కు స్వగ్రామం మడపాంలో ఆదివారం సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ప్రస్తుతం ఇదే బెటాలియన్‌లో ఎస్‌ఐ హోదాలో ఉన్న నర్సింగరావు అమరనాథ్ యాత్ర ప్రదేశంలో డ్యూటీ ఉండగా 8వ తేదీన గుండెపోటుకు గురై ఆ తర్వాత మృతి చెందారు. ఆయన పార్థివ దేహాన్ని అమర్‌నాథ్ నుంచి విశాఖకు విమానంలో ఆర్మీ అధికారులు తీసుకురాగా.. అక్కడి నుంచి స్వగ్రామం మడపాంకు ప్రత్యేక వాహనంలో తీసుకువచ్చారు. శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దపేట కూడలి నుంచి మడపాం వరకూ గ్రామస్తులు, పారామిలటరీ జిల్లా అసోసియేషన్ సభ్యులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ 60 బెటాలియన్‌కు చెందిన 9 మంది ఆర్మీ జవాన్లు వచ్చి సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు భార్య కృష్ణవేణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నర్సింగరావు మృతిపై జిల్లా పారామిలటరీ అసోసియేషన్ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది.

రైల్వే ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్



- హర్షం వ్యక్తం చేసిన ఎంపీలు
- మంత్రులకు ధన్యవాదాలు తెలిపిన వైనం



నబరంగ్‌పూర్ ఎంపీ బలభద్ర మజ్జి



కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క



కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో కలహండి ఎంపీ మాళవిక దేవి

కొరాపుట్: రాష్ట్రం పరిధిలో ఎనిమిది కొత్త రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ అనుమతి ఇవ్వడంతో కొరాపుట్, నబరంగ్‌పూర్, కలహండి జిల్లాల ఎంపీలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ ప్రాజెక్టులకు అనుమతి పట్ల హర్షాతిరేక ప్రకటన చేయగా స్థానిక ఎంపీలు కృతజ్ఞతలు తెలిపారు. తన పార్లమెంటరీ స్థానం పరిధిలో రెండు ప్రాజెక్టులు ఉండటంతో బీజేపీకి చెందిన నబరంగ్‌పూర్ ఎంపీ బలబద్ర మజ్జి కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ధన్యవాదాలు చెప్పారు. ఇప్పటికే మల్కనగిరి–జయపూర్–నబరంగ్‌పూర్ రైల్వే నిర్మాణాలు కొనసాగుతున్నాయని, కొత్తగా 173.61 కిలోమీటర్ల మేర మల్కన్‌గిరి–పాండురంగాపురం(భద్రాచలం) నిర్మాణంతో దండకారణ్యంతో మైదాన ప్రాంతానికి కనెక్టివిటీ పెరుగుతుందని తెలిపారు. అదే విధంగా నబరంగ్‌పూర్ నుంచి 116.21 కిలోమీటర్ల మేర కలహండి జిల్లా జునాఘడ్‌కు మార్గం నిర్మాణంతో మెయిన్ లైన్‌కు అనుసంధానం ఏర్పడుతుందని ఎంపీ పేర్కొన్నారు. బీజేపీకి చెందిన కలహండి ఎంపీ మాళవిక దేవి కూడా రైల్వే మంత్రి అశ్వినికి కృతజ్ఞతలు తెలిపారు. నబరంగ్‌పూర్–కలహండి జిల్లాలను కలుపుతూ రైల్వే నిర్మాణం చారిత్రాత్మక పురోగతిగా అభివర్ణించారు. సుమారు 73 కిలోమీటర్ల మేర గుణుపూర్–తెరువల్లి రైల్వే నిర్మాణం కోసం పలుమార్లు పార్లమెంట్‌లో ప్రస్తావించానని కాంగ్రెస్‌కు చెందిన కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క చెప్పారు.

ప్రాజెక్టుల అంచనా..

ఈ ప్రాజెక్ట్‌ల నిర్మాణానికి రూ.24,657 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. 2030–31 లోపు నిర్మాణం పూర్తి చేయాలి. ప్రత్యక్ష, పరోక్ష పద్ధతులలో సుమారు 3 కోట్ల మందికి ఉపాధి దొరుకుతుంది. 14 జిల్లాల్లో 64 కొత్త రైల్వేస్టేషన్లు రూపుదిద్దుకుంటాయి. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన ఆకాంక్ష జిల్లాలైన మల్కన్‌గిరి, రాయగడ, నబరంగ్‌పూర్, కలహండి జిల్లాలు వీటి పరిధిలో ఉన్నాయి.

సీనియర్ సిటిజన్లకు సత్కారం



సీనియర్ సిటిజన్లతో ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజన్లను ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి ఘనంగా సన్మానించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ల హక్కులు పరిరక్షిస్తామన్నారు. వయసు అనేది అంకె మాత్రమేనని, అందరూ సమాజ సేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కును నాయక్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కను దాస్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలి



సమావేశంలో పాల్గొన్న సిటిజన్ కమిటీ సభ్యులు

జయపురం: జయపురంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని జయపురం సిటిజన్ కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం సిటిజన్ కమిటీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు స్థలం ఎంపిక చేసినా ఇంతవరకు నిర్మాణం ప్రారంభించకపోవడం తగదన్నారు. జయపురం ప్రధాన పోస్టాఫీసులో రైల్వే టికెట్లు కూడా విక్రయించాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 1న సీనియర్ సిటిజన్ దినోత్సవం సందర్భంగా వృద్ధులను సన్మానించాలని తీర్మానించారు. సమావేశంలో కమిటీ అధ్యక్షుడు మీనకేతన్‌దాస్, కార్యదర్శి గీతాప్రకాష్ మిశ్రా, ఉపాధ్యక్షుడు దేవేంద్ర బాహిణీపతి, సలహాదారు డాక్టర్ సురుష్‌దాస్, సత్యభాను పండా, కోశాధికారి రత్నాఖర చౌదురి, యాదవ సుబుద్ధి, నాగేశ్వరరావు, నరసింగ పాణిగ్రహి, నిరంజన్ పాణిగ్రహి, మదన మోహన నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

• హర్ ఘర్ తిరంగా



అంతర్జాతీయ సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ పూరీ సాగర తీరంలో భారీ సైకత శిల్పం రూపొందించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు భారత పౌరులు హర్ ఘర్ తిరంగా ప్రచారంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. 4 అడుగులు, 8 అడుగుల విస్తీర్ణంలో ప్రధాని త్రివర్ణాన్ని పట్టుకున్న చిత్రం రూపొందించి చూపరులను ఆకట్టుకున్నారు. పూరీ బీచ్‌లో ఐదు టన్నుల ఇసుకను ఉపయోగించి దాదాపు ఐదు గంటలు నిర్విరామంగా శ్రమించి దీనిని రూపుందించినట్లు శిల్పి పేర్కొన్నారు. – భువనేశ్వర్

ప్రత్యేక గదిలోకి రథచక్రాలు



రథం భాగాలను విడదీస్తున్న వడ్రంగులు

పర్లాకిమిడి: రథయాత్ర ముగిసి నెలరోజులు పూర్తి కావడంతో పర్లాకిమిడి రాజవీధిలోని జగన్నాథ మందిరం వద్ద ఉన్న మూడు రథాల చక్రాలు, ఇరుసులు, ఇతర భాగాలను విడదీసి ప్రత్యేక గదిలో భద్రపరుస్తున్నారు. రాజవీధిలో ట్రాఫిక్‌కు తరచూ అంతరాయం కలగటంతో రథాల భాగాలను విడదీసినట్లు నిర్వాహకులు తెలిపారు.

57 బెంచీల వితరణ

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ ముత్యాలమ్మ కోనేరు (నెహ్రూ పార్క్)లో వాకర్స్ బ్యాచ్ ఆధ్వర్యంలో దాతల సాయంతో 57 కూర్చునే సిమెంట్ బెంచీలు వేశారు. ప్రతి రోజు ముత్యాలమ్మ కోనేరులో వ్యాయామానికి, నడవడానికి వచ్చే వ్యాపారులు, ఉద్యోగులు, వైద్యులు, వివిధ వర్గాలకు చెందిన మేధావులతో ఏర్పాటు చేసిన వాకర్స్ బ్యాచ్ ఈ బెంచీల ఏర్పాటుకు సహకారం అందించారు. 57 బెంచీలను అనేక మంది ముందుకు వచ్చి ఏర్పాటు చేయడంతో జంటపట్టణ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం దృష్టికి జర్నలిస్టుల సమస్యలు



సీనియర్ పాత్రికేయుడు భాస్కరరావును సన్మానిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

జయపురం: జర్నలిస్టుల సమస్యలు, డిమాండ్లను ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి దృష్టికి తీసుకెళ్తానని ఒడిశా గణవిద్య, ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి నిత్యానంద గోండ్ హామీ ఇచ్చారు. ఆదివారం స్థానిక రుతురాజ్ కల్యాణ మండపంలో ఒడిశా ఉత్కళ సంబాదిక సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ ప్రగతిలో మీడియా పాత్ర కీలకమన్నారు. జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభమైన మీడియాకు పునాదులు బలంగా లేవని వ్యాఖ్యానించారు. జర్నలిస్టుల్లో ఐక్యత లేకపోవటం వల్ల సమస్యలు, డిమాండ్లు నెరవేరట్లేదన్నారు. పాత్రికేయులకు 10 లక్షల ఆరోగ్య బీమాతో పాటు 25 లక్షల జీవిత బీమా కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఓజేఏ రాష్ట్ర అధ్యక్షుడు భిభుతి భూషణకర్ మాట్లాడుతూ సమస్యల సాధనకు ఆరేళ్లుగా పోరాడుతున్నామని చెప్పారు. ప్రస్తుత ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి మూడు నెలల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటికి రెండు నెలలు గడిచాయని, తర్వాత భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తామని చెప్పారు. అనంతరం సీనియర్ పాత్రికేయులు వి.భాస్కరరావు, బినోద్ మహాపాత్రోలను సన్మానించారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుధర పండా, ఓజేఏ కొరాపుట్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, 200 మంది జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఎరువుల సమస్య పరిష్కరించాలి



సమావేశంలో చర్చిస్తున్న వ్యాపారులు

జయపురం: సకాలంలో రసాయన ఎరువులు లభ్యం కాకపోవడంతో రైతులతో పాటు వ్యాపారులకూ ఇబ్బందులు తప్పడం లేదని జయపురం సబ్ డివిజన్ ఎరువుల రిటైల్ వ్యాపారుల సంఘం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక అగ్రసేన్ భవనంలో సంఘ అధ్యక్షుడు ఉపేంద్రకుమార్ పండా అధ్యక్షతన వ్యాపారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు యూరియా, ఎరువుల కోసం వస్తే డీఏపీ, పొటాష్ తదితర ఎరువులు సైతం కొనాలని కంపెనీలు, హోల్‌సేల్ వ్యాపారులు ఒత్తిడి తెస్తున్నారని చెప్పారు. ఈ విషయమై ప్రభుత్వం చొరవ తీసుకుని ఇబ్బందులు తొలగించాలని కోరారు. సమావేశంలో సంఘ ఉపాధ్యక్షుడు కెల్లా సుధీర్, కార్యదర్శి జితేంద్రకుమార్ పాడీ, సలహాదారు ఎం.శ్రీరామమూర్తి, ఉమాకాంత సాహు, మీడియా సెల్ ప్రతినిధి దేవీప్రసాద్ మహంతి, అజిత్‌కుమార్ సాహు, బిజయకుమార్ పండా తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛభారత్



పర్లాకిమిడి రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారాన్ని శుభ్రం చేస్తున్న బీజేపీ శ్రేణులు

పర్లాకిమిడి: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని బీజేపీ నాయకులు, కార్యకర్తలు పర్లాకిమిడి రైల్వే స్టేషన్‌లో ఆదివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆదేశాల మేరకు నేతలు ఈ.ప్రశాంత్, ఛిత్రి సింహాద్రి, జగన్నాథ మహాపాత్రో, బాలకృష్ణ పాత్రో, బబునా బెహరా, యుగంధర్ తదితరులు చెత్తాచెదారాలు తొలగించి స్టేషన్ పరిసరాలను శుభ్రం చేశారు.

రైతుపై అ'బీమా'నం ఉందా..?

- జిల్లాలో 75 శాతం వరి నాట్లు పూర్తి
- ఇప్పటి వరకు ఖరీఫ్ సీజన్‌కు ఖరారు కాని పంటల బీమా పథకం
- అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల నడుమ ఆందోళనలో అన్నదాత

కవిటి:

ఆరుగాలం శ్రమించే అన్నదాతకు సాగు భారమవుతోంది. జిల్లాలోని 30 మండలాల పరిధిలో ఈ ఏడాది సాధారణ సాగు విస్తీర్ణం 1,54,928 హెక్టార్లుగా జిల్లా వ్యవసాయశాఖ అంచనాలు సిద్ధం చేసింది. ఈ మేరకు అన్ని మండలాలకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు, వరి విత్తనాల పంపిణీ పూర్తయ్యింది. జిల్లా వ్యాప్తంగా వరిసాగు వెద పద్ధతి, నాట్లు వేసే పద్ధతుల్లో జరుగుతోంది. ఇప్పటి వరకు జిల్లాలో అధికారిక గణాంకాల ప్రకారం 1,05,960 హెక్టార్లలో వరి నాట్లు వేసినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఖరీఫ్ వరిసాగు చేసే అన్నదాతకు పంటలకు బీమా రక్షణపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. వాస్తవానికి గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రైతుకు ఎలాంటి ప్రీమియం భారం లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 50శాతం ప్రీమియంను భరించి వంద శాతం రాయితీతో పంటల బీమా పథకాన్ని అమలుచేశారు. ఈ పథకం ద్వారా రైతులు కష్టకాలంలో భారీగా బీమా పరిహారాన్ని పొందారు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక దీనిపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. దీనికి తోడు ఇస్తామన్న రైతు భరోసా సాయంపైనా ఎలాంటి ప్రకటన చేయలేదు. దీనికి తోడు పంటల బీమా పథకం గతంలో మాదిరిగా ఉండదని ప్రభుత్వంలోని కొందరు కీలక నేతలు ప్రకటనలు ఇవ్వడం అన్నదాతను మరింత ఆందోళనలోకి నెట్టేసింది.

ఎన్నో సందేహాలు..

పంట రుణాలు తీసుకున్న వారికి బీమా పథకం వర్తింపజేస్తారా? ఆ బీమా పథకం ప్రీమియం బ్యాంకులు ద్వారా కంపెనీలకు చెల్లిస్తారా? నేరుగా రైతులే చెల్లించాలా? ఈ–క్రాప్ నమోదు ఆధారంగా పంటల బీమా పథకానికి అర్హతను ఖరారు చేస్తారా? పంట రుణాలు పొందని రైతులకు ఈ పథకం వర్తిస్తుందా? అనే అంశాలు అన్నదాతల్లో గందరగోళానికి దారితీస్తున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పంటల బీమా పథకం అమలు విషయంలో కచ్చితమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వ్యవసాయ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



ఉద్దానంలో వరి పొలాన్ని సిద్ధం చేస్తున్న అన్నదాత

విధివిధానాలు పాటించాలి..



సన్న,చిన్న కారు రైతుల్లో ఆందోళనకు కారణమవుతున్న పంటల బీమా పథకానికి విధివిధానాలు ఇప్పటి వరకు ప్రకటించకపోవడం శోచనీయం. ఊరూరా రైతు సదస్సులు నిర్వహించిన అధికారులు ఇందుకు సంబంధించి రైతులు అడిగిన సందేహాలకు సమాధానాలు కూడా ఇవ్వలేకపోయారు.

– పులకల శ్రీరాములు,
రైతు, వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ సెక్రటరీ,
కవిటి మండలం

అన్యాయం చేయకూడదు..



జిల్లా వ్యాప్తంగా 75 శాతం సాగు పూర్తయ్యిందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పంటల బీమా పథకంపై కచ్చితమైన మార్గదర్శకాలను తక్షణం విడుదల చేయాలి. గత ప్రభుత్వంలో మాదిరిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో ప్రీమియం చెల్లించడం ద్వారా రైతుకు భారం లేని బీమా పథకం కొనసాగాలి. లేకుంటే అంతకన్నా మెరుగైన విధానం ఏదైనా సూచించగలిగితే దాన్ని సత్వరమే విధివిధానాలతో మార్గదర్శకాలు విడుదల చేయాలి. రైతులకు అన్యాయం చేయకూడదు.

– బద్రి ప్రకాష్,
రైతు, వైఎస్సార్‌సీపీ నేత, కవిటి మండలం

క్లుప్తంగా

ప్రబంధ మండలి పుస్తకావిష్కరణ



ప్రబంధ మండలి పుస్తకావిష్కరణ చేస్తున్న సాహితీవేత్తలు

విజయనగరం టౌన్: స్థానిక కొత్తపేటలో ఉన్న ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో ఆదివారం ప్రముఖ అవధాని డాక్టర్ కట్టమూరి చంద్రశేఖరం రాసిన ప్రబంధ మండలి గ్రంథాన్ని డాక్టర్ ఉలిమిరి సోమయాజులు ఆవిష్కరించారు. కౌముది పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి సంస్థ వ్యవస్థాపకుడు ధవళ సర్వేశ్వరరావు అధ్యక్షత వహించారు. గ్రంథ సమీక్షను డాక్టర్ జక్కు రామకృష్ణ చేశారు. నేటి సమాజానికి, ముఖ్యంగా యువతరానికి పనికి వచ్చే ఎన్నో విషయాలు గ్రంథంలో నిక్షిప్తమయ్యాయని చెబుతూ గ్రంథం రాయడానికి దారితీసిన సన్నివేశాలను, అంశాలను గ్రంథకర్త వివరించారు. కార్యక్రమంలో మానాప్రగడ సాహితి, చెరుకూరి శ్రీధర్, సరిపల్లి సోమేశ్వరరావు, టీవీ.శ్రీనివాస్, కూర్మెళ్ల సరోజిని తదితరులు పాల్గొన్నారు.

2000 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

- రెండు లీటర్ల సారాతో పట్టుబడిన మహిళ



బెల్లంఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

వేపాడ: మండలంలోని కృష్ణారాయుడుపేట గ్రామ సమీపంలో రెండువేల లీటర్ల సారా తయారీకి సిద్ధం చేసిన బెల్లం ఊటను పోలీసులు ధ్వంసం చేశారు. ఇందుకు సంబంధించి వల్లంపూడి ఎస్సై రాజేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం ఉదయం కొత్తవలస సీఐతోపాటు వల్లంపూడి ఎస్సై, సిబ్బంది కృష్ణారాయుడుపేట సమీపంలోని తోటల్లో నిర్వహించిన దాడుల్లో పట్టుబడిన రెండు వేల లీటర్ల బెల్లం ఊటను అక్కడికక్కడే ధ్వంసం చేశారు. అనంతరం రెండు లీటర్ల సారాతో పట్టుబడిన మహిళను అదుపులోకి తీసుకున్నారు. సారాతో పాటు పట్టుబడిన బెల్లం ఊట కూడా ఆ మహిళదేనని గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ క్షతగాత్రుడి మృతి



సత్యనారాయణ మృతదేహం

గంట్యాడ: మండల కేంద్రానికి చెందిన ఏలూరు సత్యనారాయణ ఈనెల 6వతేదీన తన ఇంటి నుంచి టీవీఎస్ వాహనంపై వెళ్తుండగా కారు ఢీకొట్టడంతో గాయపడ్డాడు. ఈ విషయం గమనించిన స్థానికులు విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంట్యాడ పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి..



ప్లాట్‌ఫామ్ నంబర్4లో గుర్తు తెలియని మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్ 4లో సుమారు 40 ఏళ్ల వ్యక్తి మృతదేహం ఉన్నట్లు జీఆర్‌పీ ఎస్సై రవివర్మ ఆదివారం తెలిపారు. మృతుని శరీరంపై ఎటువంటి గాయాలు లేవని, అనారోగ్యంతో మృతిచెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. నీలం రంగు షర్ట్, కాఫీరంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని, మృతుని వద్ద తెలుపు రంగు పువ్వుల డిజైన్ కలిగిన ఆకుపచ్చ రంగు దుప్పటి ఒకటి ఉందన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 9490617089 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవివర్మ తెలిపారు.

కాలువలో పడి వృద్ధుడు..

విజయనగరం క్రైమ్: స్థానిక ఫూల్‌బాగ్ అయ్యప్పనగర్ వద్ద మద్యం తాగిన మత్తులో కాలువ గట్టుపై నుంచి కింద ఫూల్‌బాగ్ కాలనీకి చెందిన వృద్ధుడు కారి నరసింహ (70) మృతిచెందినట్లు టూటౌన్ సీఐ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పైనాపిల్‌లో కొత్తరకం

- మారిషస్ వెరైటీవైపు మొగ్గు
- పంపిణీకి ఉద్యానవన అధికారుల కసరత్తు
- వంద ఎకరాల్లో విస్తరించడానికి ప్రణాళికలు
- కేరళ నుంచి రానున్న కొత్తరకం మొక్కలు



ఎక్కువ కాలం నిల్వ ఉండని సింహాచలం వెరైటీ ఫైనాపిల్



గతంలో ఇచ్చిన క్యూ వెరైటీ రకం ఫైనాపిల్ పంట

సీతంపేట: పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతంపేట ఏజెన్సీలో విస్తృతంగా పండే ప్రధాన పంటల్లో పైనాపిల్ ఒక్కటి. దాదాపు 10 వేల ఎకరాల్లో ఈ పంట విస్తరించి ఉంది. ఏటా 200 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. గిరిజనులు అనాదిగా సింహాచలం వెరైటీ మొక్కలను వేస్తున్నారు. ఇది లోకల్ వెరైటీ కావడంతో ఎక్కువగా కొండపోడు వ్యవసాయంలో గిరిజనులు పండిస్తున్నారు. ఈ రకం పంట దిగుబడి బాగున్నప్పటికీ ఎక్కువ రోజులు నిల్వ ఉండకపోవడం, దీని రసం దిగుబడి, రుచి పెద్దగా ఉండక పోవడం వంటి కారణాలతో దీని వల్ల పెద్దగా గిరిజనులకు ఆదాయ మార్గాలు ఉండడం లేదని ఐటీడీఏ, ఉద్యానవనశాఖాధికారులు భావించి నూతన రకాన్ని పరిచయం చేయనున్నారు. గిరిజనులకు ఆదాయమార్గాలు ఎక్కువగా వచ్చే రకాలపై దృష్టిసారిస్తున్నారు.

100 ఎకరాల్లో మారిషస్ వెరైటీ..

దాదాపు 100 ఎకరాల్లో సీతంపేట, భామిని మండలాల్లో కొత్త వెరైటీ అయిన మారిషస్ పైనాపిల్ సక్కర్స్‌ను పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. మరో పక్షం రోజుల్లో రైతులను ఎంపిక చేసి 90 శాతం రాయితీపై వాటిని సరఫరా చేస్తారు. ఈ మేరకు దరఖాస్తులు స్వీకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. కొత్త రకమైతే ఎక్కువగా జ్యూస్‌తో పాటు నిల్వ కూడా ఉంటుందని హార్టికల్చర్ అధికారులు చెబుతున్నారు. ఒక్కో మొక్క రూ.19లకు కొనుగోలు చేసి రైతులకు కేవలం రూపాయి నుంచి రూపాయిన్నరకు ఇవ్వనున్నరు

ఫలితమివ్వని క్యూ వెరైటీ..

రెండేళ్ల కిందట క్యూ వెరైటీని అధికారులు సరఫరా చేశారు. అది పెద్దగా ఈ వాతావరణానికి అనుకూలించలేదు. దీంతో ఈ వెరైటీని పెద్దగా రైతులు పండించలేదు. ఉద్యానవనశాఖ రూ.13 వంతున ఒక్కో మొక్కను కొనుగోలు చేసి దాదాపు రూ.14 లక్షల వరకు వెచ్చించినా ఫలితం లేకపోయింది.



కొండపోడులో పైనాపిల్ పంట

క్షేత్రస్థాయిలో 10 శాతం కూడా పంట వచ్చినట్లు కనిపించలేదు. ప్రస్తుతం ఇవ్వనున్న మారిషస్ వెరైటీ ఏ మేరకు ఫలితాలు ఇస్తుందో వేచిచూడాలని రైతులు తెలియజేస్తున్నారు.

జ్యూస్ కంటెంట్ ఎక్కువ

జ్యూస్ కంటెంట్ ఎక్కువగా ఉండే మారిషస్ వెరైటీకి మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో ఆ రకానికి ప్రోత్సాహం ఇవ్వనున్నాం. ఇదే కాకుండా ఇంకా ఏఏ వెరైటీలు ఎక్కువ కాలం నిల్వ ఉంటాయో పరిశీలిస్తున్నాం. పైనాపిల్‌లో మారిషస్ వెరైటీ ఈ ఏడాది నుంచి పరిచయం చేసి వేల్యూ అడిషన్ జరిగేలా చూస్తాం.

పేడాడ జయశ్రీ, హార్టికల్చర్ ఆఫీసర్, సీతంపేట

రైలు ప్రయాణికులకు 'మదద్'

- సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు యాప్



రైల్ మదద్ యాప్

పార్వతీపురం: రైలులో ప్రయాణించే వారికి ఏదైనా సమస్య వచ్చినప్పుడు వెంటనే ఫిర్యాదు చేసేందుకు 'రైల్ మదద్' యాప్‌ను రైల్వేశాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటికే ప్రయాణికుల భద్రతకు సంబంధించి వివిధ రకాల సేవల నిమిత్తం టోల్ ఫ్రీ నంబర్లను అందుబాటులోకి తీసుకు వచ్చింది. తాజాగా ప్రయాణికుల విషయంలో మరింత జవాబుదారీ తనంగా వ్యవహరించేందుకు వినూత్న కార్యక్రమానికి రైల్వేశాఖ శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా ఈ యాప్‌లో స్టేషన్‌లో అపరిశుభ్రత, రైలులో భద్రత, సిబ్బంది నిర్లక్ష్యం ఇలా 35 రకాల సమస్యలపై ఫొటోలు అప్‌లోడ్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదుచేస్తే ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరిస్తారు. అయితే ఫిర్యాదు చేసే వ్యక్తి రిజర్వేషన్ లేదా జనరల్, ప్లాట్‌ఫాం టికెట్లలో ఏదో ఒకటి కలిగి ఉండాలి. అప్పుడే సమస్యలపై ఈ యాప్‌లో ఫిర్యాదు చేయడానికి అవకాశం ఉంటుంది.

చేయాల్సిన ఫిర్యాదులు

రైల్వేస్టేషన్లలో అపరిశుభ్ర వాతావరణం, రిజర్వేషన్ చేసినా వెయిటింగ్ జాబితాలో ఉండడం, నీటి కొరత, వెయిటింగ్ హాల్‌లో కనీస సౌకర్యాలు లేకపోవడం, రైలు సిబ్బంది నిర్లక్ష్యం, టీటీఈ ఇతర సిబ్బంది అవినీతి, దురుసు ప్రవర్తన, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, గొలుసు దొంగతనాలు, వస్తువుల అపహరణ, మద్యం తాగడం, కొట్లాట, పొగ, మహిళల పట్ల అసభ్యకర ప్రవర్తన కలిగి ఉండడం, బోగీల్లో అపరిశుభ్రత, ఆకతాయిల వేధింపులు, మరుగుదొడ్లు, ఏసీ, ఫ్యాన్లు, లైట్లు, నాణ్యత లేని ఆహారం, అధిక ధరలకు తిను బండారాల అమ్మకం, బెడ్ రోల్స్ అపరిశుభ్రంగా ఉండడం, చార్జింగ్ పాయింట్లు పనిచేయకపోవడం, రైలు రాకపోకల్లో ఆలస్యం వంటి సమస్యలపై ఈ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

యాప్ డౌన్‌లోడ్ ఇలా..

రైలు ప్రయాణికులు ముందుగా గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి రైల్ మదద్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయాలి. ఈ యాప్‌లో వ్యక్తిగత వివరాలు, సెల్‌ఫోన్ నంబర్, ఈ-మెయిల్ తదితర వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. మీ సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీని నమోదు చేయడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఈ యాప్ ద్వారా సంబంధిత అధికారులకు సూచనలు సలహాలను అందించవచ్చు. యాప్ ద్వారా ఫిర్యాదు చేసిన సమస్య పరిష్కారం కాగానే ఎస్ఎంఎస్/ ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందిస్తారు.

గంజాయి పీలుస్తున్న ముగ్గురిపై కేసు

విజయనగరం క్రైమ్: స్థానిక గాజులరేగ రైల్వే ట్రాక్ పక్కన గంజాయి పీలుస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు టూటౌన్ సీఐ టి.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. లంకాపట్నానికి చెందిన పొట్నూరు రాజశేఖర్, బలరాం, ధర్మపురికి చెందిన మరిచర్ల చిట్టిబాబులను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

'కెంబూరి' కుటుంబానికి పరామర్శ



కెంబూరి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ డి.వి.జి శంకరరావు

చీపురుపల్లి: మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే కెంబూరి రామ్మోహనరావు కుటుంబాన్ని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డి.వి.జి.శంకరరావు పరామర్శించారు. ఆదివారం పట్టణంలోని లావేరురోడ్‌లోని కెంబూరి నివాసానికి వచ్చిన ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు ముందుగా రామ్మోహనరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు, రామ్మోహన్‌రావు బావమరిది, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కిమిడి గణపతిరావు, కెంబూరి సోదరులు లక్ష్మణమోహన్, భరత్ మోహన్‌తో మాట్లా డుతూ రామ్మోహనరావు మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. రాజకీయంగా, వ్యక్తిగతంగా రామ్మోహనరావుతో తనకు చక్కని అనుబంధం ఉండేదని, కొద్దిరోజుల క్రితం కూడా తనతో ఫోన్‌లో మాట్లాడినట్లు కుటుంబ సభ్యులకు శంకరరావు వివరించారు.

లేబర్ చట్టాలు, వేతనాలు అమలు చేయాలి

- హైర్ బస్ డ్రైవర్స్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న తులసీరామ్

విజయనగరం ఫూల్‌బాగ్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న హైర్ బస్ డ్రైవర్లు, కాంట్రాక్ట్ కార్మికులకు లేబర్ చట్టాలు, కనీస వేతనాలు అమలు జరిగే విధంగా డిపో మేనేజర్లు బాధ్యత వహించాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తులసి రామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కంచే చేను మేసినట్లు అన్న చందాన ఆర్టీసీ హైర్ బస్ డ్రైవర్లు, కాంట్రాక్ట్ వర్కర్ల పరిస్థితి ఉందని, గత 30 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నప్పటికీ లేబర్ చట్టాలు, కనీస వేతనాలు అమలు కావడం లేదని, హైర్ బస్ యజమానులు, కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, సర్క్యులర్ ప్రకారం జీతం, వీక్లీ ఆఫ్‌లు, ప్రభుత్వ సెలవులు అమలు చేయడం లేదని వాపోయారు. అద్దె బస్ టెండర్‌లో పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని ఉన్నా పట్టించుకోవడం లేదని, డిపో మేనేజర్‌కు విన్నవించినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదని, డ్రైవర్లకు రూ.27500 బేసిక్ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై రవాణా శాఖ మంత్రికి, కార్మిక శాఖ కమిషనర్‌కు నివేదించామని తెలిపారు. సమావేశంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎ.జగన్ మోహన్ రావు, అధ్యక్ష, కార్యదర్శులు రాజు, సురేష్, డిపో అధ్యక్ష కార్యదర్శులు మధు, వాసు, కోశాధికారి ధనుంజయ, కోటి తదితరులు పాల్గొన్నారు.

నెటిజన్లూ ఖబడ్దార్..!



వకుల్ జిందాల్, ఎస్పీ

- సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు
- అకౌంట్స్ పర్యవేక్షణకు ప్రత్యేక బృందం
- ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: సోషల్ మీడియాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా అనుచితమైన పోస్టులు పెట్టి, విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ప్రకటనలో హెచ్చరించారు. సోషల్ మీడియా ప్రభావం తీవ్రంగా ఉన్న ప్రస్తుత తరుణంలో వాస్తవాలను వక్రీకరిస్తూ మతాలు, కులాలు, పార్టీలను రెచ్చగొడుతూ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, యూట్యూబ్, టెలిగ్రామ్, వాట్సాప్, లింకిడిన్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఎవరికి తోచిన విధంగా వారు పోస్టులు పెట్టి విద్వేషాలు రెచ్చగొడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై జిల్లా పోలీసు శాఖ నిఘా పెట్టిందని పేర్కొన్నారు. ఇందుకుగాను ఒక పోలీస్ బృందాన్ని ప్రత్యేకంగా నియమించి, సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ బృందం అందుబాటులో ఉన్న సాంకేతికతను వినియోగించుకుంటూ, విద్వేషాలను రెచ్చగొట్టే ఉద్దేశంతో పోస్టులు పెట్టిన వారి వివరాలను రాబట్టి, వారికి నోటీసులు జారీచేసి, చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు ఉపక్రమిస్తుందని స్పష్టం చేశారు.

వాస్తవాలు వక్కీకరించొద్దు

ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి పర్యవేక్షణలో ఒక ఎస్సై, టెక్నికల్ టీమ్ ఆరుగురు సభ్యులతో పనిచేస్తుందన్నారు. ప్రజలు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ వినియోగిస్తున్న సమయంలో విజ్ఞతతో వ్యవహరించాలని హితవు పలికారు. తాము పోస్టు పెట్టేటప్పుడు వాస్తవాలను వక్రీకరించడం, వాస్తవాలు తెలుసుకోకుండా పోస్టులు చేయడం వల్ల ఇతరుల మనోభావాలు దెబ్బతింటాయన్న వాస్తవాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని సూచించారు. సోషల్ మీడియాను పాజిటివ్ విషయాలను విస్తృతం చేసేందుకు, దూర ప్రాంతాల్లో ఉన్న మిత్రులు, బంధువులను దగ్గర చేర్చే విధంగా వినియోగించుకోవాలని కోరారు. యువత, ప్రజలు సోషల్‌మీడియను పాజిటివ్ కోణంలో వినియోగించుకుని, సాంకేతికతను అందిపుచ్చుకుని, నిర్దేశించుకున్న లక్ష్యానికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. విద్వేషాలు రెచ్చగొడుతూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపైనా, వారిని ప్రోత్సహించే వారిపైనా చట్టపరమైన కఠినచర్యలు తప్పవని నెటిజన్లను ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు.

పచ్చ..పచ్చని చేలో..ఓ లాలా..!



భూమికి పచ్చాని రంగేసినట్టు..అని ఓ సినీ గేయరచయిత రాసిన గీతానికి అద్దంపట్టినట్లు ఉంది ఈ చిత్రం. మెరకముడిదాం మండలంలోని బుదరాయవలస నుంచి సోమలింగాపురం వెళ్లే ప్రధానరహదారిని ఆనుకుని రైతులు సాగుచేస్తున్న సుమారు 40 నుంచి 50 ఎకరాల వరిపంట పచ్చని తివాచీలా కనిపిస్తూ చూపరులను ఆకట్టుకుంటోంది.

-మెరకముడిదాం

వారంతే..!



రహదారి భద్రత..సురక్షిత ప్రయాణంపై ఎంతలా ప్రచారం చేస్తూ అవగాహన కల్పిస్తున్నా..అంతా బూడిదలో పోసిన పన్నీరే అవుతోంది. ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండి..అన్నీ తెలిసిన వారే ఏమీ పట్టించుకోకుండా ఇష్టానుసారం రోడ్లపై ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో వారి ప్రాణాలకే కాకుండా ఎదుటివారిని కూడా ప్రమాదాలకు గురిచేస్తున్నారు.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం









16,17 తేదీల్లో 'క్రీస్తు ఆగమన సిద్ధపడు' సభలు

విజయనగరం టౌన్: జిల్లా కేంద్రంలో ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహించే క్రీస్తు ఆగమన సిద్ధపడు సభలను విజయవంతం చేయాలని యేసు ప్రేమాలయం పాస్టర్ అలజంగి రవికుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జీసస్ బ్లెస్సింగ్ చర్చి విశ్వాసులు రెవరెండ్ నిర్మల సురగాల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం చర్చి ఆవరణలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాడ కళాభారతి వేదికగా జరిగే ఈ సభలకు జిల్లాలోని క్రీస్తు ఆరాధకులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. రెవరెండ్ మధుసూదన్ లోపింటి, రెవరెండ్ ఆంద్రేయ, రెవరెండ్ జాన్ వెస్లీ అధిక సంఖ్యలో క్రీస్తు ఆరాధకులు పాల్గొన్నారు.

జిల్లాలోకి ఏనుగుల గుంపు



అప్పుడే పుట్టిన ఏనుగు పిల్లను రక్షించుకుంటున్న ఏనుగులు

వంగర: మండలంలోని వి.వి.ఆర్‌పేట గ్రామ సమీపంలోకి ఏనుగుల గుంపు ప్రవేశించింది. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం కెల్ల సమీపంలో ఉన్న ఆరు ఏనుగుల గుంపు నాగావళి నది దాటుకొని ఆదివారం ఉదయం వి.వి.ఆర్‌పేట గ్రామ సమీపంలోని శివాలయం మీదుగా పంట పొలాల్లోకి ప్రవేశించాయి. మొక్కజొన్న, వరి, చెరకు, పామాయిల్ పంటలను నాశనం చేశాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరు ఏనుగుల గుంపులో ఒక ఏనుగు పిల్లకు జన్మనిచ్చింది. చిన్న ఏనుగు పిల్లతో సహా ఏడు ఏనుగుల గుంపు అయింది. ప్రస్తుతం వి.వి.ఆర్.పేట - పెదరాజులగుమ్మడ గ్రామాల మధ్య పంట పొలాల్లో ఏనుగుల గుంపు తిష్ట వేశాయి. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. వంగర పోలీసులతో పాటు బొబ్బిలి ఎఫ్‌డీవో స్వప్న, ఎలిఫెంట్ ట్రాకర్స్ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఏనుగుల గుంపును కవ్వించొద్దని, అలా చేస్తే ప్రజల ప్రాణాలకు ప్రమాదమని పేర్కొన్నారు. ప్రతీ ఏటా ఏనుగులు తమ గ్రామాల్లో ప్రవేశించి పంటలను నష్టపరుస్తున్నాయని, దీంతో ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులతో పాటు సర్పంచ్ బత్తిన గురువులు, ఉప సర్పంచ్ మరిచెర్ల విజయలక్ష్మి, ఎంపీటీసీ బంగారపు కాంతారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఏనుగులను ఈ ప్రాంతం నుంచి తరలించి తమ ప్రాంత రైతులకు న్యాయం చేయాలని వారు కోరారు.

నిరుపయోగంగా కియోస్క్ యంత్రాలు

బొబ్బిలి రూరల్: నాడు రైతులకు ఎంతో మేలు చేకూర్చిన కియోస్క్ యంత్రాలు నేడు నిరుపయోగంగా మూలన పడి ఉన్నాయి. రైతులు తమ పంటలకు అవసరమైన విత్తనాలు, ఎరువులను నేరుగా వారి గ్రామం నుంచే పొందేందుకు ఈ ఆధునిక యంత్రాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి రైతుభరోసా కేంద్రంలోను ఏర్పాటుచేసింది. బొబ్బిలి మండలంలోని 19 గ్రామాల్లో గల రైతుభరోసా కేంద్రాలతోపాటు పట్టణ పరిధిలో రైతులకు అందుబాటులో ఉండేందుకు వ్యవసాయశాఖ కార్యాలయంలో మరో మూడింటిని ఏర్పాటుచేసింది. డిజిటల్ విధానంలో నూతన ఆవిష్కరణలతో రైతులకు సేవలు అందించిన గత ప్రభుత్వం లక్షలాదిరూపాయలు వెచ్చించి వాటిని కొనుగోలు చేసింది. ఈ యంత్రాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ యంత్రాలు, రైతులు పంటలను ఉత్పత్తి చేసేటప్పుడు ఉన్న మార్కెట్‌ధరలు, దగ్గరలోఉన్న మార్కెట్ వివరాలు, తదితర అవసరమైన అన్ని సేవలను ఈ డిజిటల్ కియోస్క్ యంత్రం ద్వారా తెలుసుకునే వీలుంది. కచ్చితమైన సమాచారం, ఫలితాలతో నాడు రైతులకు వ్యవసాయశాఖ అన్ని విధాలా అవగాహన కల్పించింది. వాతావరణ సమాచారం, వాతావరణంలో మార్పులు తదితర అంశాలు, ఏ సమయంలో ఏ పంట వేయాలన్న సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందుపరిచి రైతులకు అందించేవారు.

కొత్త ప్రభుత్వంలో రైతు సేవాకేంద్రాల్లో దీని వినియోగంపై నిర్లక్ష్యం నీడలు కమ్ముకున్నాయి. కేవలం ఎరువులను మాత్రమే బుకింగ్ చేసుకునేందుకు వాడుతున్నారు. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతుండగా వినియోగంలో లేని కియోస్క్ డిజిటల్ యంత్రాలు బూజుపట్టే పరిస్థితి నెలకొంది. ఖరీఫ్‌సీజన్ దాదాపు పూర్తికావస్తోంది. రానున్న రబీ సీజన్‌కైనా వాటి సంపూర్ణ వినియోగానికి ప్రభుత్వం దృష్టిసారించాలని రైతులు కోరుతున్నారు.



మూలకు చేరిన కియోస్క్ డిజిటల్ యంత్రాలు